బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



శాస్త్రిపురం: సులేమాన్‌నగర్ బీఆర్ఎస్ నాయకుడు షేక్ నయింముద్దీన్ ఆధ్వర్యంలో సులేమాన్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నయింముద్దీన్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకూ లబ్ధి చేకూరిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో అక్బర్, రఫీక్, రసూల్, అర్షద్, ఇస్మాయిల్, ఫయీం ఇమ్రాన్, అక్రమ్, కుర్షీద్, అలీం, వసీం తదితరులు పాల్గొన్నారు.

'జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే గెలుపు'



నవీన్‌యాదవ్‌తో కాంగ్రెస్ నాయకులు

మణికొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు అని మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను బుధవారం కలిసి కాంగ్రెస్ టికెట్ సాధించినందుకు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురికాలనీ, షేక్‌పేట, ఓయూ కాలనీలోనూ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కుమార్, లక్ష్మీశ్రీ, మాజీ వైస్ చైర్మన్ బి.శ్రీరాములు పాల్గొన్నారు.

నిలిచిన ఆర్టీఏ సేవలు



మణికొండ: రవాణా శాఖ సాఫ్ట్‌వేర్ సమస్యలతో బుధవారం ఆర్టీఏ కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. మణికొండలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఉదయం నుంచే సర్వర్ సమస్య రావడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 2 గంటల పాటు వాహన మిత్ర సాఫ్ట్‌వేర్‌ను బాగు చేసేందుకు ప్రయత్నించిన అధికారులు అది రాష్ట్రవ్యాప్త సమస్యగా తెలుసుకుని మిన్నకున్నారు. కార్యాలయం ఎదుట సాఫ్ట్‌వేర్ సమస్య వలన ఈ రోజు కార్యకలాపాలు నిలిపేశామని ఓ బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో చేసేది లేక పనుల కోసం వచ్చిన ప్రజలు తిరిగి వెళ్లిపోయారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మణికొండ: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ మండలం, రాందేవ్‌గూడకు చెందిన ఎంబీ రాములు (55) ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా పని చేసేవాడు. ఇటీవల అప్పులు ఎక్కువగా కావడంతో ఇచ్చిన వారు డబ్బులు అడుతుతున్నారు. దీంతో పాటు మంగళవారం రాత్రి భార్యతో గొడవ జరిగింది. అనంతరం ఇంట్లో నుంచి బైక్‌పై వెళ్లి మంచిరేవుల సమీపంలోని వేణుగోపాలా స్వామి ఆలయ సమీపంలో ఓ చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. ఉదయం అటుగా వెళ్లిన వారు చూసి పోలీసులకు, భార్యకు సమాచారం ఇచ్చారు. భార్య ఉమారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లో నిల్వ చేసిన టపాకాయలు సీజ్

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని ఓ నివాస గృహంలో అక్రమంగా నిల్వ చేసిన టపాకాయలను పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా టపాకాయల దుకాణాలకు తాత్కాలిక అనుమతులు ఇస్తున్నామన్నారు. స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం వరకు 10 దరఖాస్తులు అందాయన్నారు. అనుమతులు లేని దుకాణాలను గుర్తించి సామగ్రిని సీజ్ చేసి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్‌లో పూర్తయిన సీసీ రోడ్డు పనులను రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులు, బస్తీ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తీ నాయకులు, స్థానికులు రోడ్డు పనులు పూర్తి చేసినందుకు కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్, సంతుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, భూషణ్, మోహన్, దత్తుబాయ్, బాబులాల్, ఆనంద్, అశోక్, రాజేశ్, శేఖర్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహామూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ @27 టన్నులు..!



సిద్ధమవుతున్న తడి చెత్తకు సంబంధించిన కాంపోజిట్ యార్డు

శంషాబాద్: పట్టణంలో పెరుగుతున్న జనాభాతో పాటు చెత్త ఉత్పత్తి కూడా విపరీతంగా పెరుగుతోంది. ఆరేళ్ల క్రితం మున్సిపాలిటీగా ఏర్పాటు కాకముందు ప్రతిరోజు 10 టన్నుల చెత్త వచ్చేది. అయితే గడిచిన ఆరేళ్లలోనే ఏకంగా మరో 17 టన్నుల చెత్త సేకరణ, శుభ్రం చేయడం పారిశుద్ధ్య సిబ్బందికి భారంగా మారుతోంది. మరోవైపు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని సంబంధిత అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నా.. ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.



పట్టణంలో చెత్త సేకరిస్తున్న సిబ్బంది

కొన్నేళ్లుగా..

2019 మార్చిలో శంషాబాద్ మేజర్ గ్రామ పంచాయతీతో పాటు సమీపంలోని సాతంరాయి, కొత్వాల్‌గూడ, ఊట్‌పల్లి, తొండుపల్లి, గొల్లపల్లి కలిసి పురపాలక సంఘంగా ఏర్పాటైంది. ఏడాది కిందట మరో 7 గ్రామాలు సైతం మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. వాణిజ్య కార్యకలాపాలతో పాటు శంషాబాద్ విమానాశ్రయం రెండో దశ విస్తరణ తర్వాత పట్టణంలో జనాభా భారీగా పెరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుత విలీన గ్రామాలతో కలుపుకుని పట్టణ జనాభా 44,631 ఉండగా, ప్రస్తుతం అధికారుల అంచనా ప్రకారం ఇది సుమారు 70 వేలకు పైచిలుకు ఉన్నట్లు అంచనా ఉంది. స్థానికంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు సంఖ్య పెరిగింది. పట్టణంలో ఇంటి నంబర్ల ఆధారంగా ఉన్న ఆవాసాల సంఖ్య 20 వేలకు పైగా ఉండగా, అందులో అద్దె గదుల్లో ఉన్న కుటుంబాల సంఖ్య దాదాపు రెండింతలకు పైగా ఉంటోంది. నివాసాలతో పాటు వ్యాపార అవసరాలకు వచ్చిపోయే జనాభాకు కూడా ఉండడంతో పట్టణంలో వ్యర్థాలు కూడా భారీ స్థాయిలో పెరిగాయి.

మున్సిపాలిటీలో ప్రతిరోజు ఉత్పత్తవుతున్న చెత్త

- పెరుగుతున్న జనాభా, నివాస గృహాలు
- 6 ఏళ్ల కిత్రం 10 టన్నులు, ప్రస్తుతం 27 టన్నుల సేకరణ
- తడి చెత్తతో సేంద్రీయ ఎరువుల తయారీ
- తడి, పొడి చెత్త వేర్వేరు సేకరణ అంతంతే
- అవగాహన కల్పిస్తున్నా పట్టని జనాలు

ప్రతిరోజు ఉత్పత్తి అవుతున్న చెత్త 27 టన్నులు

తడి చెత్త	16 టన్నులు
పొడిచెత్త	6 టన్నులు
మిక్స్‌డ్ (కలిపి ఉన్నవి)	4.5 టన్నులు
హానికరమైన వ్యర్థాలు	0.5 టన్నులు

మొత్తం పారిశుద్ధ్య సిబ్బంది

స్వీపర్లు	108
కామాటి, జవాన్లు	76
చెత్త సేకరణ ఆటోలు	37
ట్రాక్టర్లు	8
ఇతర యంత్రాలు	2

కొత్త కాంపోజిట్ యార్డు సిద్ధం..

పట్టణంలో ఐదేళ్లుగా పొడి చెత్త సేకరణ కేంద్రం నడుస్తోంది. దీనికి తోడు తాజాగా తడి చెత్తను కూడా డంపింగ్‌యార్డులో పారబోయకుండా సేంద్రీయ ఎరువులు తయారు చేసేలా కాంపోజిట్ యార్డును సిద్ధం చేశారు. ఇది త్వరలోనే అందుబాటులోకి రానున్నది. పొడి చెత్తలోని రీసైక్లింగ్ వ్యర్థాలను ఇప్పటికే కొన్ని స్వయం సహాయక గ్రూపుల ద్వారా విక్రయిస్తున్నారు.



పరిశుభ్రతకు సహకరించాలి

పట్టణ పరిశుభ్రతలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. ప్రతిఒక్కరూ తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి. చెత్తను బహిరంగంగా కాల్చితే చర్యలు తీసుకుంటాం. దీని ద్వారా వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. అలాగే తడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువులు తయారు చేసే కేంద్రం కూడా సిద్ధమవుతోంది.

– బి. సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

సమస్యలు తెలుసుకునేందుకే పర్యటనలు



డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, లక్ష్మీగూడ, బృందావన్‌కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు బుధవారం పర్యటించారు. నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనుల కోసం వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులకు సూచించారు. అదేవిధంగా పెండింగ్‌లోని సీసీ రోడ్డు పనులు, భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ పనులతో పాటు బృందావన్ కాలనీలోని పుల్లిగుట్ట నాలా పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్దన్, హనుమంత్‌రెడ్డి, అడికే శివ, ధనరాజ్, సతీశ్, రంజిత్‌సింగ్, రజనీకాంత్, శ్రీకాంత్‌రెడ్డి, అనిల్, రాజు, శంకర్‌రెడ్డి, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత



పందులు పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ వ్యాప్తంగా పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో పందుల సంఖ్య పెరిగిపోయి పారిశుద్ధ్యానికి విఘాతం కలిగిస్తున్నాయనే ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పందులను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ.. పెంపకందారులు పందులు బయట తిరగకుండా చూసుకోవాలని లేదంటే వాటిని దూర ప్రాంతాలకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో వేగంగా నిర్మాణం



మేస్త్రీలకు అవగాహన కల్పిస్తున్న ఇంజినీర్ మహ్మద్ సాహెర్

మణికొండ: రోబోటిక్ టెక్నాలజీతో అంతర్జాతీయ ప్రమాణాలతో భారతి సిమెంట్ కొత్తగా అల్ట్రాఫాస్ట్ సెట్టింగ్ పేరుతో 5 స్టార్ గ్రేడ్ సిమెంట్‌ను విడుదల చేసిందని దీని ద్వారా వేగంగా నిర్మాణాలు పూర్తవుతాయని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహెర్ అన్నారు. పుప్పాలగూడ శ్రీసాయి బాలాజీ స్టీల్, సిమెంట్ డీలర్ షాప్‌లో మేస్త్రీలకు సిమెంట్‌పై బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ నాణ్యతతో ఉంటుందన్నారు. స్లాబులు, పిల్లర్లు, వంతెనలు, రహదారులకు ఈ సిమెంట్ వాడితే నిర్మాణాలు మరింత పటిష్టంగా ఉంటాయన్నారు. ఇతర సిమెంట్ కంటే ధరలో రూ. 20 మాత్రమే అదనంగా ఉన్నా పటిష్టతలో ప్రపంచ స్థాయిలో ఉంటుందన్నారు. డీలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ మధ్య ఎక్కువమంది భారతి అల్ట్రాఫాస్ట్ సెట్టింగ్ 5 స్టార్ గ్రేడ్ సిమెంట్‌నే కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్ తరపున రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగించాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ హ్యాపీ హోమ్స్‌కాలనీ దక్కన్ ఎలైట్ హోటల్ నుంచి సెయింట్ ఆడమ్స్ హైస్కూల్ వరకు ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించాలని హ్యాపీ హోమ్స్‌కాలనీ, గోల్డెన్ హైట్స్‌కాలనీ, జన చైతన్య ఫేజ్–1, ఫేజ్–2 కాలనీల ప్రజలు కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.సురేందర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ శ్రీధర్, ట్రాఫిక్ ఎస్ఐ విఠల్ నాయక్‌ను బుధవారం కాలనీకి బుధవారం పిలిపించి పరిస్థితిని వివరించారు. అనంతరం 4 కాలనీల ప్రతినిధులు డాక్టర్ జి.విజయ భూషణం, సయ్యద్ హిదాయతుల్లా షఫీ, సర్ఫరాజ్ సిద్దిఖీ, ముజాహిద్ సికిందర్, సుజాత్ పటేల్, జుల్ఫీ ఫారూఖ్ బాయ్‌తో పాటు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. రోడ్డకిరువైపులా ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి స్పందిస్తూ కాలనీ ప్రజలకు అసౌకర్యంగా మారిన దుకాణాలను తొలగిస్తామని తెలిపారు. దుకాణదారులకు 2 రోజుల సమయం ఇస్తున్నామని ఫుట్‌పాత్‌లపై దుకాణాలను తొలగించుకోవాలని లేకుంటే శనివారం ఫుట్‌పాత్‌లపైకి వచ్చిన అన్ని నిర్మాణాలు, దుకాణాలు తొలగిస్తామన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. హైదర్షాకోట్‌లోని ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

హైదర్షాకోట్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు కూడా విగ్రహానికి పూలమాలలు వేశారు.

కేపీఆర్ కాలనీ ప్రవేశంలో ..

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేపీఆర్ కాలనీ ప్రవేశంలో మాజీ కౌన్సిలర్ కే రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ యాలాల నరేశ్, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బి. శ్రీరాములు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్, నాయకులు శ్రావణ్ కుమార్, గంగాధర్, వేణు, నాగిరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.



మణికొండలో నివాళులర్పిస్తున్న నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మణికొండ ఏఈ సంతోష్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ, సత్యమ్మ గార్డన్, మర్రిచెట్టు సర్కిల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాని ఆయన కోరారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం



శంషాబాద్ రూరల్: చేతులు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని పెద్దగోల్కొండ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏసీ. లావణ్య సూచించారు. స్కూల్లో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మ మాట్లాడుతూ.. చేతులకు ఉండే క్రిములు, బ్యాక్టీరియా, వైరస్ ఆహారంతో పాటు శరీరంలోకి వెళ్లి తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తరచూ చేతులను శుభ్రం చేసుకుంటే మనతో పాటు కుటుంబ సభ్యులు కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. చేతులను శుభ్రపర్చుకోవడం అలవాటుగా మార్చుకోవాలని స్వచ్ఛ విద్యాలయ జాతీయ అవార్డు గ్రహీత, పాఠశాల ఉపాధ్యాయుడు నరేంద్ర సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిష్టయ్య, కిశోర్ కుమార్‌రెడ్డి, మంగమ్మ, గన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ పాఠశాలలో 'పోషణ మాసం'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఉన్నత పాఠశాలలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, హైస్కూల్ హెచ్ఎం సుగుణ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, లలిత, ఎం.సంగీత, బస్తీ దవాఖాన డాక్టర్ వినిత్, ఆశ వర్కర్లు మీనా, టి.మీనా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు రక్తహీనత, పరిశుభ్రత, సమతుల ఆహారం తదితర వాటిపై అవగాహన కల్పించి పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. కిశోర బాలబాలికలు ముఖ్యంగా ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, గుడ్లు వంటి పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని ఉమారాణి సూచించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి

హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతలు



జేసీబీతో నిర్మాణాలు కూల్చివేయిస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: స్థానిక జనచైతన్య లేఅవుట్‌లో ఆక్రమణలకు గురైన 4.5 ఎకరాల పార్కు స్థలాలకు హైడ్రా అధికారులు బుధవారం విముక్తి కల్పించారు. అందులోని నిర్మాణాలను కూల్చి హద్దులు వేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఉప్పర్‌పల్లి, బుద్వేల్ సర్వే నంబర్లలో 1997 నుంచి జనచైతన్య పొలాలను ఆనుకుని హెచ్ఎండీఏ నుంచి ప్లాట్లుగా మార్చి విక్రయించడం ప్రారంభించింది. మొదటి దశలో 68 ఎకరాల వెంచర్ చేసిన అనంతరం ఫేజ్–1,2,3 పేరిట 132 ఎకరాల్లో వెంచర్లు చేపట్టింది. ఇందులో 30 పార్కులను ఏర్పాటు చేసి అప్పటి రాజేంద్రనగర్ మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేసింది. ప్రస్తుతం ఇక్కడ స్థలం లక్ష రూపాయలకు గజం పలుకుతోంది. దీంతో కొందరు కబ్జాదారులు 4 పార్కులతో పాటు మూసీ పరీవాహక ప్రాంతాన్ని కబ్జా చేసి భారీ షెడ్లు, ప్రహరీలు నిర్మించారు. దీంతో జనచైతన్య సొసైటీ సభ్యులు గత వారం హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో సంప్రదింపులు జరిపిన హైడ్రా కబ్జా జరిగిందని నిర్ధారించింది. భారీ బందోబస్తు మధ్య బుధవారం ఉదయం నిర్మాణాలను కూల్చి 4 ఎకరాల 20 గుంటల స్థలాన్ని గుర్తించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. బహిరంగా మార్కెట్‌లో ఈ స్థలం విలువ రూ. 100 కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు తెలిపారు.

మిగిలిన కబ్జాలు కూడా తొలగించాలి: స్థానికులు

జన చైతన్య 4 వెంచర్లల్లోని పార్కు స్థలాలను కొందరు కబ్జా చేసి నిర్మాణాలను చేపట్టారని స్థానికులు పేర్కొన్నారు. మరో 8 పార్కుల వరకు కబ్జాదారుల చెరలో ఉన్నాయని వాటిని సైతం విడిపించాలని కోరుతున్నారు. గతంలో రాజేంద్రనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చిన తిరిగి నిర్మాణాలు చేపట్టారని హైడ్రా అధికారులకు స్థానికులు వివరించారు. పార్కుల విషయాన్ని దస్తావేజులతో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సిబ్బంది స్థానికులకు సూచించారు.